International Journal of Academic Research
P-ISSN: 2348-7666: Impact Factor: 6.023
Homepage: https://www.ijar.org.in/
Volume-12, Issue-3, July-Sep-2025
This work is licensed under a Creative Commons Attribution 4.0 International License [CC BY 4.0]

**Research Article**

# కందుకూరి వారి 'వివేకవర్ధిని' పత్రికా రంగసేవ

**దేవరపల్లి రామయ్య**
ఆంధ్రోపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గుమ్మలక్ష్మీపురం, పార్వతీపురం మన్యం జిల్లా

**వ్యాస సంగ్రహం:**

ఆధునిక ఆంధ్రప్రదేశ్ చరిత్రలో సంఘ సంస్కరణలకు, పత్రికా రంగానికి కందుకూరి వారి 'వివేకవర్ధిని' పత్రిక ఒక దిక్సూచిలా నిలిచింది అనడంలో సందేహం లేదు. సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు 1874లో ఈ పత్రికను స్థాపించారు. మూఢనమ్మకాలు, అవినీతిని రూపుమాపడం, మహిళా సాధికారతే ఈ పత్రిక ముఖ్య ఉద్దేశాలు. ఈ పత్రిక గొప్పతనం చెప్తూనే స్త్రీ విద్యకు పెద్దపీట వేసింది. ఆ కాలంలో స్త్రీ విద్యను సమాజం తీవ్రంగా వ్యతిరేకించింది. అలాంటి సమయంలో మహిళల సమస్యలపై, వారి చదువు అవసరాలపై వివేకవర్ధినిలో అనేక వ్యాసాలు ప్రచురించి చైతన్యం తెచ్చారు. ప్రభుత్వ అధికారులలోని అవినీతిని, సమాజంలోని మూఢాచారాలను, బానిసత్వ పద్ధతులను నిర్భయంగా ఖండించారు. ఈ పత్రిక ద్వారా వచ్చిన ఆలోచనల స్ఫూర్తితోనే వీరేశలింగం గారు ఆంధ్రదేశంలో మొట్టమొదటి వితంతు పునర్వివాహాన్ని జరిపించారు. మొదట మద్రాసులో ముద్రించబడిన ఈ పత్రిక, క్రమంగా రాజమండ్రిలో సొంత ప్రెస్‌ను ఏర్పాటు చేసే స్థాయికి ఎదిగింది. మాసపత్రికగా మొదలై, పక్షపత్రికగా, ఆ తర్వాత వారపత్రికగా రూపాంతరం చెందింది. ఇలాంటి పత్రిక నేటి పత్రికా రంగానికి పునాదిగా నిలిచింది అని పరిశీలించి చెప్పడమే ఈ వ్యాస ముఖ్యోద్దేశం.

**కీలక పదాలు:**

సంఘసంస్కరణ, వితంతు వివాహం, పత్రికా రంగం, వివేక వర్ధిని, బానిసత్వం, స్త్రీవిద్య, స్త్రీ సాధికారత, మాసపత్రిక, వారపత్రిక మొదలైనవి.

**కవి పరిచయం:**

"సంఘర్షణ వైరుధ్యాల సమాలోచన నుండి ప్రభవించి ప్రకటితమైన అసాధారణ వస్తు స్వభావమే నూతన యుగం! మానవుని చరిత్రలో ఈ నూతన యుగం కర్తవ్యరూపంగా కాల క్రమంలో ప్రకటిత మవుతూవస్తున్నది. ఈ నూతన యుగ ప్రభావానికి ప్రేరకాలు పరిస్థితులూ, కారకులు మనుష్యులూ అవుతారు. ఆ విధంగా అలా కారకులైన మనుష్యుల్నే యుగపురుషులు అంటారు -వీరేశలింగం యుగపురుషుడు."

తెలుగు సాహిత్యంలో, సంఘ సంస్కరణలో 'నవయుగ వైతాళికుడు' లేదా 'ఆంధ్ర రాజారామ్మోహన్‌రాయ్'గా పేరుగాంచిన కవి, బహుముఖ ప్రజ్ఞాశాలి కందుకూరి వీరేశలింగం పంతులు. వీరు ఏప్రిల్ 16, 1848న రాజమండ్రిలో జన్మించారు. తెలుగు సాహిత్యంలో మొట్టమొదటి నవలగా పేరొందిన 'రాజశేఖర చరిత్రము'ను రచించారు. అలాగే తొలి స్వీయ చరిత్ర, తొలి నాటకం, తొలి విజ్ఞాన శాస్త్ర పుస్తకాలను తెలుగులోకి అనువదించిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఆయన చేసిన విశేషమైన గద్య రచనల వల్ల 'గద్య తిక్కన' అని ప్రసిద్ధి చెందారు. స్త్రీ విద్య కోసం పాటుపడ్డారు. అప్పట్లో సంఘంలో తీవ్ర వ్యతిరేకత ఉన్నప్పటికీ, మొట్టమొదటి వితంతు వివాహాన్ని జరిపించారు. బాల్య వివాహాలు, వరకట్న వ్యవస్థలను తీవ్రంగా వ్యతిరేకించారు. సమాజంలో చైతన్యం తీసుకురావడానికి 'వివేకవర్ధిని', 'సతీహిత బోధిని', 'హాస్య సంజీవిని' వంటి పత్రికలను నడిపారు. 1919 మే 27న పరమపదించారు.

**పత్రికా రంగ సేవ:**

పత్రికా రంగంలో కొత్త ఒరవడిని తీసుకువచ్చి తెలుగు సాహితీ లోకాన్ని నూతన కోణంలో ఆవిష్కరించిన నవ్యాంధ్ర వైతాళికుడు కందుకూరి వీరేశలింగంగారు. ఈయన 1874లో వివేకవర్ధినిని స్థాపించడంతో తెలుగు పత్రికల చరిత్రలో నవశకం ప్రారంభమయిందని చెప్పవచ్చు. ఇది కేవలం ఒక పత్రిక అనడం కంటే ఒక వ్యవస్థ అనటం సముచితం. అవనీతిని, సంఘ దురాచారాలను దునుమాడిన వజ్రాయుధం అనటం ఇంకా సముచితం. అవినీతిపరులైన ప్రభుత్వాధి కారులకు వజ్రా యుధంగా భావ విప్లవ కేతన్నాన్ని ఎగురవేసి పత్రికను మించిన స్థాయిని పొందగలిగింది.

వివేకవర్ధినిని ప్రారంభించే సమాయానికి రాజమండ్రిలో ప్రింటింగ్ ప్రెస్సులు లేవు. ఒక్క మద్రాసులోనే ఉండేవి. అందువలన ఈ పత్రిక మొదట్లో అరఠావు సైజులో కేవలం నాలుగు పేజీలలో మద్రాస్‌లో కొక్కండ వెంకటరత్నం గారి ఆంధ్రభాషాసంజీవని ప్రెస్సులో మాసపత్రికగా ముద్రించబడేది. నాలుగు సంచికలు ఆ ప్రెస్సులో ముద్రించారు. కా సకాలంలో అది వెలువడేదికాదు. అంతేకాక వీరేశలింగంగారు, వెంకరత్నంగార్ల మధ్య భావవైరుధ్యం తీవ్రరూపం రాల్చినందువలన కూడా ప్రెస్సును మార్చుకోవలసి వచ్చింది. అందువలన పత్రిక మద్రాసు లోని శ్రీధర్ ప్రింటింగ్ ప్రెస్సులో ముద్రింపబడేది. పత్రిక 1/8 డెమ్మీసైజులో 16 పేజీలలో అచ్చయ్యేది, తర్వాత క్రమేపి వీరేశలింగంగారు రాజమండ్రిలో సొంత ప్రెస్సును ఏర్పాటు చేసుకోవడంతో పత్రిక స్థిరత్వాన్ని సంపాదించుకోగలిగింది. పత్రిక ఆదరణ పెరగడం వలన కావచ్చు 1877లో వీరేశంలింగం గారు దీన్ని పక్షపత్రికగానూ 1886లో వారపత్రిగా నిర్వహించారు. దాదాపు 20 సంవత్సరాలు ఇది నడిచింది.

రేశలింగంగారు ఈ పత్రికను స్థాపించడంలో తన ఆశయాలను స్పష్టంగా వివరించారు. అలాగే ఒక సామాజిక, ప్రయోజనం, భాషా ప్రయోజనాన్ని ఆశించి వీరేశలింగంగారు పత్రికను నడిపారన్న విషయం కూడా ద్యోతకమవుతుంది.

"ఈ పత్రిక ప్రకటన యందు యుద్దేశము భాషాభివృద్ధియు దేశాభివృద్ధియు ముఖ్యంగా రెండు నేర్పరుచుకున్న భాషాభివృద్ధి మార్గము తెలుగు భాషలో మృదువైన సులభశైలిలో సులక్షణమైన వచన రచన చేయుచూ దేశాభివృద్ధి మార్గము, జనులలో దురాచారములను బాపి వృద్ధి పద్ధతులు జ్ఞానమువారిని అధిక నీతిమంతులుగా చేసి దేశమును

ఉన్నతస్థితికి తెచ్చుటకు శక్తివంచన లేకుండా పాటుపడుట దేశాభివృద్ధి కలుగుటకు విద్యావిషయములను, నీతి విషములను మత విషయాలను, కులాచార విషయాలను నానా ముఖములుగా కృషి చేయవలెననియె కాని రాజ్యాంగ విషయంలో పనిచేయుట నా ఉద్దేశం కాదు"(తెలుగు పత్రికలు ప్రసార మాధ్యమాల భాషా స్వరూపం) అని తన ఆశయాన్ని స్పష్టంగా పేర్కొన్నారు. అలాగే రాజకీయాలకు, రాజ్యాంగ విషయాలకు తమ పత్రిక దూరంగా ఉంటుందని అన్నారు. నిజానికి ఆ రోజులలో బ్రిటిష్ ప్రభుత్వ విధేయతే ఆనాటి ప్రముఖుల సహజధర్మంగా ఉండేది. అందుకే స్వాతంత్ర్యేచ్ఛ ప్రజలలో కలుగలేదు. ప్రథమ భారత స్వాంతత్ర్య సంగ్రామ ప్రభావం ఆంధ్రదేశంపై పడలేదు. కాబట్టే ఆనాటి పత్రికలు రాజకీయాలకు ప్రాధాన్యం ఇవ్వలేదు.

"ఒరులేయని యొనరించిన
నరవర యప్రియము తనమనంబున కగుదా
నొరులకు నది సేయకునికి
పరాయణకు పరధర్మ పదముల కెల్లన"

(టిటిడి మహాభారతం, శాంతిపర్వం,పంచమాశ్వాసం, 205వ పద్యం)

అనే విదుర సూక్తిని వీరేశలింగంగారు తన పత్రిక ముఖతిలకంగా వాడుకున్నారు. ఈ విదురసూక్తినే కాశీనాథుని నాగేశ్వరరావు గారు తన ఆంధ్రపత్రికకు ముఖతిలకంగా వాడుకున్నారు.

తన పత్రిక, పాఠకుల మధ్య గల సంబంధాన్ని వీరేశంగంగారు వివరించే ప్రయత్నం చేశారు."మా వివేకవర్థని తన్నుంజేపట్టిన వారలతోడ మొట్టమొదట తెలుగు మాటలతో మాటిమాటికి నీతులనే సంభాషించుచుండును. ఆ వెనుక దనుసు వృత్తాంభావంబు మెరయ నానాశ్లేషంబు కొందరును వింతలగు వృత్తాంత కథనంబు మరికొందరును తేనెలొలుక సుధామధురోక్తులతో కొందరును తమ ప్రచురణా నందవారధి తేల్చుచుండును. మరియు నాయా సమయుంబుల నవరస నొచితంబులగు పెక్కు విషయములను మిక్కిలి యక్కరతో నొక్కి వక్కాణించు చుండును. కాబట్టి నవరసికులకు మన యాంధ్రదేశీయులందరు నత్యల్ప ధన లభ్యంగా వున్న మా వివేకవర్థని పడయులందుడెందంబులం బొందించి గైకొందుర నిదయామందానంబున మేమందరం బెదురు చూచున్నారము." అని పేర్కొన్నారు.

ఇటీవలి కాలంలో బాగా ప్రాచుర్యంలోకి వచ్చిన ఇన్‌వెస్టిగేటివ్ జర్నలిజానికి 125 సంవత్సరాల క్రితమే వీరేశలింగంగారు శ్రీకారం చుట్టారు. స్థానిక ప్రభుత్వాధికారుల అవనీతినీ లంచగొండితనాన్ని వీరేశలింగంగారు పరిశోధించి పైకి లాగి, తన పత్రికలో నిర్భయముగా బయటపెట్టేవారు. ఇందువలన ఎదురయ్యే బెదిరింపులకు కాని కోర్టు దావాలకు కాని ఆయన ఎన్నడూ భయపడలేదు. ఇప్పటి బరితెగించిన ప్రభుత్వోద్యోగులులా అప్పటివారు బరితెగించలేదు. లంచాలు తీసుకున్నా గోప్యంగా జరిగిపోయేవి. తాము లంచం తీసుకున్నట్లు బయటపడితే సిగ్గుతో అవమానంతో కృంగిపోయేవారు, వీరేశలింగంగారు ఇట్టి లంచగొండి అధికారుల గురించి పత్రికలో ప్రచురించినందువలన అప్రతిష్టను తట్టుకోలేని ఒక శిరస్తదారుకు మతిభ్రమించింది. ఒక జిల్లా మున్సబు ఒక ప్రభుత్వ ప్లీడరు ఆత్మహత్య చేసుకున్నారుట. అందువలన

రాజమండ్రి ప్రభుత్వోద్యోగులు లంచం తీసుకోవడానికి భయపడేవారు. అక్రమాలకు, అవినీతికి తన సన్నిహితులు పాల్పడినా`ఆయన తన పత్రికలో విమర్శించేవారు. అందువలన కావలసిన వారికి కూడా వీరేశలింగం గారు శత్రువులయ్యారు.

వివేకవర్ధనికి అనుబంధంగా మరికొన్ని పత్రికలు నడపడంలోనే వీరేశలింగంగారి గొప్పతనం తెలియవస్తుంది. కొన్ని పత్రికలను తన పత్రికలో విలీనం చేసుకున్నారు. మరికొన్ని పత్రికలను నిర్వహించారు. 1883లో సతీహితబోధిని అనే పత్రికను స్థాపించి నాలుగు సంవత్సరాలు నడిపారు. 1887 హాస్యసంజీవని అనే పత్రికను కొక్కొండ వారి హాస్యవర్ధినికి పోటీగా నడిపారు. నరసాపురానికి చెందిన మజయా ల్ ఆలీఖాన్ అనే ముస్లిం నడుపుతున్న విద్వన్ మనోహరిణి వివేకవర్ధినిలో విలీనం అయింది. ది ఇండియన్ అనే ఇంగ్లీషు పత్రిక ఈ పత్రికకు అనుబంధంగా కొంత కాలం వెలువడింది. ఇంతేగాక న్యాపతి సుబ్బారావుగారితో కలిసి చింతామణిని, రాయసం వెంకటశివుడు గారితో కలసి జనానా పత్రికలకు సంపాదకత్వం వహించి పత్రికా రంగానికి ఎనలేని సేవచేశారు కందుకూరి.

వీరేశలింగం గారు రాజమండ్రిలో ప్రార్థనాసమాజం పేరిట సత్యసంవర్ధిని అనే మాసపత్రికను నడిపారు. ఈ పత్రికలో వీరేశలింగంగారు బ్రహ్మసమాజ వ్యవస్థాపకుడు రాజారామమోహనరాయ్ జీవత చరిత్రను ప్రచురించారు. మొదట ఇది 8 పేజీలు తర్వాత 16 పేజీలలో వెలువడేది. 1905లో సత్యవాది అనే పత్రికను కూడా నడిపారు. అప్పట్లో ఆర్యమతబోధిని అనే పత్రిక హిందూమత చాంధసభావాలను ప్రచారం చేసింది. దాన్ని ఖండించడానికే సత్యవాదినిని ప్రారంభించారు.

1879లో గోదావరి ఎడ్యుకేషన్ ట్రస్టు అనే పత్రికను రెవరెండ్ బారో అనే క్రైస్తవ మిషనరీ రాజమండ్రి నుంచి ఇంగ్లీషు, తెలుగు భాషలలో నడిపారు. గోదావరి విద్యాబోధిని అనే తెలుగు విభాగాన్ని వీరేశలింగంగారు నిర్వహించారు.

వీరేశలింగంగారి పట్టుదల కలిగిన మహాపురుషుడు. ఒకవైపు ఉపాధ్యాయ వృత్తి మరొకవంక రచనలు`తెలుగు కవి జీవితాల చరిత్ర వంటి పరిశోధనాత్మక రచనలు, మరొక వైపు వివిధ పత్రికల నిర్వహణ, ఉన్న పరిస్థితులలో ఇన్ని మహత్తర బాధ్యతలను తన భుజస్కంధాలపై వేసుకుని జయప్రదంగా నిర్వహించారంటే మానవ మాత్రులకు ఇది ఆశ్చర్యం కలుగుతుంది. ఒక పత్రికను నడపడమే చాలా కష్టమయినప్పుడు ఒక వ్యక్తి తన బహుముఖ వ్యాపకాలమధ్య ఇన్ని పత్రికలు ఒంటిచేత్తో నడిపారండటే నమ్మసక్యం కాదు. కాని ఇది నిజం.

**ముగింపు:**

రాజమండ్రిలో మొట్టమొదటిగా వెలువడిన ఈ తెలుగు పత్రిక నేడు అనేక పత్రికలకు ఆదర్శంగా నిలుస్తుంది. 1874 నుంచి 1930 మధ్యకాలంలో ఈ పట్టణం నుంచి అనేక ఉత్తమ పత్రికలు వచ్చాయి. వాటన్నిటికి స్ఫూర్తి వివేకవర్ధిని . చివరిగా వివేకవర్ధిని గురించి నాలుగు మాటలలో చెప్పుకోవాలంటే సాంఘిక సారస్వత భాషాసేవలకు భావ విప్లవానికి వివేకవర్ధిని వేదికగా మారింది. సామాజిక పరిణామానికి విప్లవ భావ వికాసానికి హేతుదృక్పథావలంబనకు ఈ పత్రిక బాసటగా నిలిచింది. తెలుగు పత్రికలలో తనకంటూ ఒక ముద్రను ఏర్పాటు చేసుకుంది అనడంలో సందేహం లేదు.

**ఆధార గ్రంథాలు:**

1.ఆరుద్ర, సమగ్ర ఆంధ్ర సాహిత్యం (నాల్గవ సంపుటం)తెలుగు సాహిత్య అకాడమి, హైదరాబాదు, 2004.

2.నాగయ్య, ఆచార్య జి., తెలుగు సాహిత్య సమీక్ష (రెండవ సంపుటం)నవ్య పరిశోధక ప్రచురణలు, తిరుపతి, 1995.

3.రమాపతిరావు, అక్కిరాజు, వీరేశలింగం రచనలు-ప్రహసనములు (నాల్గవ సంపుటం) విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1993.

4.వీరేశలింగం, కందుకూరి: కందుకూరి వీరేశలింగం రచనలు, శ్రీ చింతామణి ముద్రాక్షరశాల, రాజమహేంద్రవరం, 1909.

5.వీరేశలింగం, కందుకూరి, మౌఢ్యనమ్మకాలు, దురాచారాలపై బ్రహ్మాస్త్రం హాస్య సంజీవని, ప్రజాశక్తి బుక్ హౌస్, హైదరాబాద్, 2011.

**Citation:** దేవరపల్లి రామయ్య 2025. "కందుకూరి వారి 'వివేకవర్ధిని' పత్రికా రంగసేవ". International Journal of Academic Research, 12(3): 119-123.

**Copyright:** ©2025 దేవరపల్లి రామయ్య. This is an open-access article distributed under the terms of the Creative Commons Attribution License (https://creativecommons.org/licenses/by/4.0/), which permits unrestricted use, distribution, and reproduction in any medium, provided the original author and source are credited.